సాక్షి
సంగారెడ్డి
మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023



అధికారుల నిర్వాకంతో అసౌకర్యం

జిల్లా అధికారి అత్యుత్సాహంతో అసౌకర్యం కల్గిందని, వారి పక్షాన రెండు చేతులు జోడించి క్షమించాలని కోరుతున్నానంటూ మంత్రి హరీశ్ రావు దివ్యాంగులకు క్షమాపణ కోరారు. 8లో



దామర చెరువు వెలవెల

ఆరేళ్లుగా చుక్కనీరు చెరువులోకి రాకపోవడంతో అందోలు మండలం చింతకుంట గ్రామానికి చెందిన రైతులు సోమవారం మెదక్ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. 9లో

ఒకరికి పాజిటివ్



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 33 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్ట్‌లు నిర్వహించగా అందులో ఒకరికి పాజిటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్ట్‌లు 26 మందికి నిర్వహించినట్లు పేర్కొన్నారు.

రంజాన్ వేళలు

మంగళవారం ఇఫ్తార్	బుధవారం సహర్
సా.6:38	ఉ.4:33

న్యూస్‌రీల్

కుంభమేళాకు ప్రత్యేక బస్సులు

ఆర్టీసీ రీజియన్ మేనేజర్ సుదర్శన్



బస్టాండ్ ఆవరణను పరిశీలిస్తున్న ఆర్ఎం సుదర్శన్

నారాయణఖేడ్: న్యాల్‌కల్ మండలం రాఘవాపూర్ సమీపంలోని మంజీరా నది వద్ద ఈనెల 24 నుంచి ప్రారంభం కానున్న కుంభమేళాకు భక్తుల సౌకర్యార్థం జహీరాబాద్, సంగారెడ్డి, హైదరాబాద్, బీదర్‌ల నుంచి ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ రీజియన్ మేనేజర్ సుదర్శన్ నారాయణఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్యకు సూచించారు. నారాయణఖేడ్ డిపోను సోమవారం ఆయన తనిఖీ చేశారు. బస్టాండ్ పరిసరాలను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా బస్సు సర్వీసులు నడపాలని ఆదేశించారు. రాజీవ్‌చౌక్, బసవేశ్వర చౌక్‌లను పరిశీలించి బసవేశ్వర చౌక్ వద్ద బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఎండలో బస్సుల కోసం నిరీక్షిస్తుండటాన్ని గుర్తించారు. అక్కడ మినీ బస్టాండ్ ఏర్పాటు విషయాన్ని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని డీఎంకు సూచించారు. ఆయన వెంట ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజరు ప్రవీణ్‌కుమార్, మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలయ్య

పటాన్‌చెరు టౌన్: పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాంతో ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలయ్య అన్నారు. సోమవారం పటాన్‌చెరు పట్టణంలోని కుమ్మరిబస్తీ వాసులతో ముదిరాజ్ భవన్‌లో పబ్లిక్ కాంటాక్ట్ కార్యక్రమాన్ని వివిధ శాఖల అధికారులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో ఆయా కాలనీల్లో నెలకొన్న చిన్నచిన్న సమస్యలను పరిష్కరించేందుకు జీహెచ్ఎంసీ పరిధిలో పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాంను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి సమస్యలు తెలుసుకొని సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతామన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలో రెండు టీంలను ఏర్పాటు చేశామని, ఇన్‌చార్జిలుగా జీహెచ్ఎంసీ డీఈ క్రాంతికుమార్, ఏఈ శివకుమార్ ఉన్నారని తెలిపారు. డివిజన్ పరిధిలో ఈ కార్యక్రమం అన్ని కాలనీల్లో కొనసాగుతుందని చెప్పారు.

మే 1 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

సంగారెడ్డి టౌన్: రాష్ట్ర క్రీడా శాఖ ఆదేశాల మేరకు మే 1 నుంచి 31వ తేదీ వరకు నెల రోజులపాటు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి రామచందర్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్యాంపులకు సంబంధించి క్రీడా సామగ్రి, గౌరవ వేతనం ఇస్తారని వెల్లడించారు. పట్టణ ప్రాంతాల్లో నిర్వహించే క్యాంపులకు క్రీడాకారుల నుంచి కోచింగ్ ఫీజు వసూలు చేసుకొని నిర్వహణ వ్యయం భరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. క్రీడాంశాల్లో ప్రతిభ గల సీనియర్ క్రీడాకారులు, జాతీయస్థాయి క్రీడాకారులు, పీఈటీలు, ఫిజికల్ డైరెక్టర్లు క్రీడా శిబిరాలు నిర్వహించేందుకు పూర్తి వివరాలతో ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత, ఆసక్తిగల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ శిబిరాలు ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు సమీకృత కలెక్టరేట్ భవనంలోని రెండో అంతస్తులో జిల్లా యువజన, క్రీడల అధికారి కార్యాలయంలో నేరుగా గాని, 08455274344లో గాని సంప్రదించాలని కోరారు.

పరిహారం వచ్చేదెప్పుడో?

- వడగళ్ల వానతో దెబ్బతిన్న పంటలు
- నష్టపోయిన ప్రతీ ఎకరాకు రూ.10 వేలు
- ప్రకటించి నెల కావొస్తున్నా ఊసే లేని వైనం
- జిల్లాలో నాలుగు వేల ఎకరాల్లో పంట నష్టం



కోహీర్ మండలంలో వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న జేడీఏ నర్సింంహారావు(ఫైల్)

జహీరాబాద్: ఇటీవల కురిసిన వడగళ్ల వాన రైతులను నిండా ముంచింది. ఈదురుగాలులతో కూడిన వడగళ్లు పడటంతో పంటలు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయాయి. జిల్లాలో 3,093 మంది రైతులకు సంబంధించి 4,047 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించారు. ప్రధానంగా మొక్కజొన్న, జొన్న, సోయాబీన్, తెల్లకుసుమ, శనగ పంటలతో పాటు టమాట, ఉల్లిగడ్డ, గోబీ, క్యాబేజీ, వంకాయ తదితర కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. మామిడి, బొప్పాయి పంటలకు సైతం అపార నష్టం వాటిల్లింది. గత నెల 16, 17వ తేదీల్లో భారీ వర్షాలు కురిశాయి. ఎకరాకు సుమారు రూ.20 నుంచి రూ.30వేల వరకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేలా లేదని రైతులు వాపోతున్నారు.

అత్యధికంగా జహీరాబాద్ డివిజన్‌లోనే..

- జిల్లాలో 4,047 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించారు. జహీరాబాద్ మండలంలో 374.24 ఎకరాలు, మొగుడంపల్లి మండలంలో 154.37 ఎకరాలు, కోహీర్ మండలంలో 1794.16 ఎకరాలు, ఝరాసంగం మండలంలో 451.11 ఎకరాలు, న్యాల్‌కల్ మండలంలో 206.06 ఎకరాలు, రాయికోడ్‌లో 37.25 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించారు.
- మునిపల్లి మండలంలో 95.23 ఎకరాలు, వట్‌పల్లి మండలంలో 2.15 ఎకరాలు, సదాశివపేట మండలంలో 183.01 ఎకరాలు, కంది మండలంలో 8.06 ఎకరాలు, అందోల్ మండలంలో 20.18 ఎకరాలు, కల్హేర్ మండలంలో ఐదెకరాలు, కంగ్టి మండలంలో 341.18 ఎకరాలు, మనూర్ మండలంలో 26.38 ఎకరాలు, నాగల్‌గిద్ద మండలంలో 12.10 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు నిర్ధారించారు. ఒక్క జహీరాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో అత్యధికంగా 2,981 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 2,112 మంది రైతులు నష్టపోయారు.

ప్రభుత్వానికి చేరిన నివేదిక

పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల వంతున పరిహారం చెల్లించాలని ప్రభుత్వం ప్రకటించింది. అన్ని రకాల పంటలకు ఇదే పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. వడగళ్లతో దెబ్బతిన్న పంటలపై సర్వే చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు యుద్ధ ప్రాతిపదికన సర్వే చేపట్టారు. వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖలు సర్వే నిర్వహించి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. వివరాలు అందించి దాదాపు నెల కావస్తున్నా పరిహారం చెల్లించే విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



అకాల వర్షానికి మనియార్‌పల్లిలో నేల రాలిన మామిడి కాయలు(ఫైల్)

మామిడికాయలు రాలిపోయాయి



వడగళ్ల వానకు 12 ఎకరాల మామిడి తోటలో కాయలు పూర్తిగా రాలిపోయాయి. 90 శాతం పంట దెబ్బతినగా మిగిలిన 10 శాతం కాయలు వడగళ్ల దెబ్బకు గురయ్యాయి. రూ.10లక్షలు పెట్టుబడి పెట్టాను. పూత సమయంలోనే తోటను విక్రయించి అడ్వాన్స్ తీసుకున్నాను. ఇప్పుడు డబ్బులు వాపసు ఇవ్వాలంటున్నారు.

– రాజ్‌కుమార్ దేశ్‌పాండే, మనియార్‌పల్లి

రైతులను ఆదుకోవాలి



వడగళ్ల వానకు మొక్కజొన్న పూర్తిగా నేలవాలింది. వడగళ్ల వానకు పంట చేతికి అందకుండా పోయింది. ఎకరంన్నర విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేశాను. రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టాను. దీనికోసం అప్పు చేశాను. గ్రామంలో సుమారు 70 ఎకరాల్లో పలు రకాల పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– జి.శ్రీనివాస్, బడంపేట

ప్రభుత్వానికి నివేదిక పంపాం

జిల్లాలో జరిగిన పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదికలు పంపాం. వడగళ్ల వానతో జిల్లాలో అత్యధికంగా జహీరాబాద్ డివిజన్ పరిధిలో పంట నష్టం జరిగినట్లు గుర్తించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ అధికారులు, సిబ్బంది సర్వే చేసి పంట నష్టాన్ని గుర్తించారు.

– నర్సింంహారావు, జేడీఏ, సంగారెడ్డి



మాట్లాడుతున్న మాణిక్‌రావుఠాక్రే, చిత్రంలో ఆ పార్టీ రాష్ట్ర నేతలు

సంగారెడ్డిలో ఇఫ్తార్ విందు

హాజరైన కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని మిలాద్‌గ్రౌండ్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లింలు ఉపవాస దీక్షను విరమించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ విందుకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావుఠాక్రే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పలువురు రాష్ట్ర నేతలు మాట్లాడుతూ మైనార్టీలకు కాంగ్రెస్ ఎప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శులు నదీమ్ జావీద్, రోహిత్ చౌదరి, ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు అజాహరుద్దీన్, మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ పీసీసీ అధ్యక్షుడు వి.హన్మంతరావు, పొన్నాల లక్ష్మయ్య, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుసుమ కుమార్, గాలి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది



చెక్కులు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, ఎమ్మెల్యే క్రాంతికిరణ్

జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ

జోగిపేట(అందోల్): కేసీఆర్ ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలతో పాటు వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులపై కూడా ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌తో కలిసి అందోల్, పుల్కల్, చౌటకూర్, టేక్మాల్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, రంజాన్ సందర్భంగా తోఫాలను ముస్లింలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటుతో ప్రజల బతుకులు మారాయని పేర్కొన్నారు. మిషన్ భగీరథతో ఇంటింటికీ నల్ల కనెక్షన్ ఇచ్చామని తెలిపారు. పథకాల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తున్నామన్నారు. 365 మంది లబ్ధిదారులకు, రూ.3 కోట్ల విలువ కలిగిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్ మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, అందోల్ తహసీల్దార్ వెంకటేశం, డిప్యూటీ తహసీల్దార్ మధుకర్ రెడ్డి, ఎంపీపీ బాలయ్య, వైస్ ఎంపీపీ మహేశ్వర్ రెడ్డి, జోగిపేట మాజీ మార్కెట్ చైర్మన్లు మల్లికార్జున గుప్తా, నాగభూషణం, పి.నారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రవీణ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మీకాంతరెడ్డి, మాజీ ఎంపీపీ రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్‌పూర్, తెల్లాపూర్ మున్సిపాలిటీల పరిధిలో నూతనంగా ఏర్పాటైన గేటెడ్ కమ్యూనిటీలకు సైతం హెచ్ఎండబ్ల్యూ ద్వారా రక్షిత మంచినీళ్లు అందించేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హెచ్ఎండబ్ల్యూఎస్ జీఎం నారాయణ, డీజీఎం చంద్రశేఖర్, అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ సుజాత, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు అందించాలన్న సీఎం కేసీఆర్ నిర్ణయానికి అనుగుణంగా పనులు చేపట్టాలని కోరారు. నీటి ఎద్దడి నివారణకు రెండు మున్సిపాలిటీల పరిధిలో భారీ రిజర్వాయర్లు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. గేటెడ్ కమ్యూనిటీలతోపాటు నూతన కాలనీలకు సైతం రక్షిత మంచినీరు అందించాలని కోరారు.

టీఎంఎస్‌ను గెలిపించుకుందాం

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు



జహీరాబాద్: జహీరాబాద్ పట్టణంలోని మహీంద్ర అండ్ మహీంద్ర కర్మాగారంలో జరుగుతున్న కార్మిక సంఘం ఎన్నికల్లో టీఎంఎస్ బలపర్చిన అభ్యర్థి ఎంజీ రాములును భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. సోమవారం రాత్రి కర్మాగారం వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. ఈనెల 20వ తేదీన జరగనున్న ఎన్నికల్లో తెలంగాణ మజ్దూర్ సంఘ్(టీఎంఎస్) అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కార్మికులను కోరారు. బస్సు గుర్తుకు ఓటు వేసి మద్దతు తెలపాలన్నారు. సమావేశంలో సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, బీఆర్ఎస్ నాయకులు నారాయణ, సురేశ్, నామ రవికిరణ్, రాంచందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రమణకుమార్

పెండింగ్ కేసులను పరిష్కరించాలి

సంగారెడ్డి మున్సిపాలిటీ: పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఎస్పీ రమణకుమార్ అన్నారు. మంత్లీ క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో భాగంగా సోమవారం ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరం చేసిన వారికి శిక్ష పడినప్పుడే ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెరుగుతుందని, రౌడీలు, కేడీలు సస్పెక్ట్‌ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఉషావిశ్వనాథ్, సంగారెడ్డి డీఎస్పీ రవీంద్రారెడ్డి, పటాన్‌చెరు డీఎస్పీ భీమ్ రెడ్డి, జహీరాబాద్ డీఎస్పీ రఘు, నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రామ్ రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ బాలాజీ, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మహేశ్‌గౌడ్, సీఐలు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

బీదర్ జిల్లాలో నామినేషన్ల జోరు

భాల్కి, హుమ్నాబాద్‌లో రాహుల్‌గాంధీ ప్రచారం



రాహుల్‌గాంధీకి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ అభ్యర్థి ఈశ్వర్‌ఖండ్రే

జహీరాబాద్: జహీరాబాద్‌కు పక్కనే ఉన్న కర్ణాటకలోని బీదర్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల జోరు సాగుతోంది. సోమవారం కాంగ్రెస్ తరపున నామినేషన్లు వేసేందుకు చేపట్టిన అభ్యర్థుల ర్యాలీలో కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ పాల్గొన్నారు. ముందుగా భాల్కిలో కాంగ్రెస్ అభ్యర్థి ఈశ్వర్‌ఖండ్రే నిర్వహించిన ర్యాలీ, బహిరంగ సభలో పాల్గొన్నారు. అనంతరం హుమ్నాబాద్ అసెంబ్లీకి కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న రాజశేఖర్‌పాటిల్ తరపున నామినేషన్ల ర్యాలీ, సభలో పాల్గొని ప్రసంగించారు. ఈ ర్యాలీలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. బసవకళ్యాణ్‌లో బీజేపీ తరఫున శరణుసల్‌గ్రాట్ నామినేషన్ వేశారు.

అర్హులందరికీ బీమా పథకాలు

అదనపు కలెక్టర్ వీరారెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సంగారెడ్డి టౌన్: ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలల్లో అర్హులందరూ నమోదయ్యేలా ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో పంచాయతీ, గ్రామీణ అభివృద్ధి అధికారులు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్‌తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకానికి 18 నుంచి 50 ఏళ్లలోపు వారు అర్హులని, బ్యాంక్ అకౌంట్ కలిగిన వారందరూ సంవత్సర బీమా ప్రీమియం రూ.436 చెల్లించాలన్నారు. అలాగే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకానికి 18 నుంచి 70 ఏళ్ల వయస్సు వారందరూ అర్హులని, సంవత్సర బీమా ప్రీమియం రూ.20 ఉంటుందని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత వైకల్యం కలిగినా రూ.2 లక్షలు, పాక్షిక వైకల్యం కలిగితే రూ.లక్ష బీమా వస్తుందని వివరించారు. జిల్లాలో గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రత్యేక క్యాంపుల నిర్వహణకు షెడ్యూల్ ఖరారు చేయాలని సూచించారు. సర్పంచ్‌తో సహా ఇతర ప్రజాప్రతినిధులందరికీ క్యాంపు వివరాలు తెలియజేయాలన్నారు. క్యాంప్ నిర్వహణకు రెండు రోజుల ముందు గ్రామాల్లో టాంటాం వేయించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం గోపాల్ రెడ్డి, డీఆర్డీఓ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి పంచాయతీ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి
- ప్రజావాణికి 32 అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి, తదితరులు

సంగారెడ్డి టౌన్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై ప్రజలు తరలివచ్చారు. వారి నుంచి వినతులు స్వీకరించారు. ఇందులో ఎక్కువగా భూ సమస్యలు, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఆసరా పెన్షన్లు, ఉపాధి కల్పన, దివ్యాంగుల ఉపకరణాలు, బ్యాటరీ సైకిల్, తదితరాలపై 32 దరఖాస్తులు వచ్చాయని, అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 17 అర్జీలు అందగా, గ్రామీణ అభివృద్ధి సంస్థ, ఐసీడీఎస్, హౌసింగ్ తదితర శాఖలకు సంబంధించి 15 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, కలెక్టరేట్ ఏఓ, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు మంజూరు చేయాలి



డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని వట్‌పల్లి మండలం భూత్కూర్ గ్రామానికి చెందిన బంటు మాణయ్య ప్రజావాణిలో అధికారులకు అర్జీ అందజేశాడు. 2013లో ఇల్లు కూలిందని అప్పటినుంచి మండల అధికారులకు విన్నవించినా పటించుకోవడం లేదన్నాడు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని వేడుకున్నాడు.

ఇప్పటికీ పాస్ బుక్ రాలేదు



పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామానికి చెందిన మాణయ్య కొత్తగా ధరణి వచ్చిన సమయంలో కొత్త పాస్ బుక్ కోసం దరఖాస్తు చేసుకున్నానని అప్పటినుండి ఇప్పటివరకు పాసుబుక్ రాలేదని తెలిపాడు. పలుమార్లు మండల కార్యాలయంలో కలిసినా ఎటువంటి ప్రయోజనం లేదని, జిల్లా అధికారులు స్పందించి కొత్త పాస్ బుక్ వచ్చేలా చూడాలని కోరాడు.

పింఛన్ వచ్చేలా చూడాలి



సంగారెడ్డి మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన బోయిన సునీత ప్రభుత్వం అందజేస్తున్న పింఛన్ రావడంలేదని ప్రజావాణిలో అధికారుల ముందు వాపోయింది. ఇప్పటికైనా స్పందించి పింఛన్ మంజూరు చేయాలని కోరింది.

పరిశ్రమ నిర్మాణం ఆపాలి

కెమికల్ పరిశ్రమ నిర్మాణం ఆపాలంటూ హత్నూర మండలంలోని వడ్డేపల్లి గ్రామంతో పాటు పరిసర గ్రామాల రైతులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కెమికల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి వ్యతిరేకంగా సుమారు 200 మంది కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. సురభి లాబరేటరీకి చెందిన కెమికల్ కంపెనీతో పంట భూములు నష్టపోతాయని, కాలుష్యం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కెమికల్ కంపెనీ నిర్మాణాన్ని వెంటనే ఆపివేయాలని కోరారు.



కంపెనీ పరిశ్రమ నిర్మాణం ఆపాలంటూ నిరసన తెలుపుతున్న రైతులు

క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్‌లో మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమాన విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్ చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 34 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా 33 మందికి జడ్జి రూ.2వేలు జరిమానా విధించారు. మరో వ్యక్తికి రూ.5వేలు జరిమాన విధించినట్లు ట్రాఫిక్ సీఐ పేర్కొన్నారు.

సిద్దిపేటకమాన్‌లో..

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం...పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో నాలుగు రోజుల క్రితం సిబ్బందితో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా 21 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సోమవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.48,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

కారులో మహిళ ప్రసవం

చిన్నశంకరంపేట(మెదక్): పురిటినొప్పులతో బాధపడుతున్న మహిళను ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సకాలంలో రాకపోవడంతో కారులో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మహిళ ప్రసవించిన సంఘటన చిన్నశంకరంపేటలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉదయం చిన్నశంకరంపేట మండల కేంద్రానికి చెందిన ఎర్రబోయిన భాగ్యను కాన్పుకోసం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి కారులో తీసుకెళుతుండగా మార్గమధ్యలోనే ప్రసవం అయింది. కుటుంబ సభ్యుల సహకారంతో ఆశ వర్కర్ ప్రసవం చేసింది. దీంతో ప్రాథమిక చికిత్సనంతరం తల్లి, పాపను కారులోనే మెదక్‌లోని మాత శిశు ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

మనోహరాబాద్(తూప్రాన్): కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెల వలన నష్టపోయిన బాధిత కుటుంబాన్ని తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని మెదక్, సిద్దిపేట్ జిల్లాల అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షుడు గండి మల్లేశ్‌యాదవ్, మామిండ్ల ఐలయ్య యాదవ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం మనోహరాబాద్ మండల కేంద్రానికి చెందిన నిమ్మల చిన్న మల్లేశ్‌ను వారు పరామర్శించారు.

హరితహారం మొక్కలను కాల్చిన వ్యక్తికి జరిమానా

మద్దూరు(హుస్నాబాద్): హరితహారంలో నాటిన మొక్కలను కాల్చిన వ్యక్తికి రూ.3వేలు జరిమానా విధించారు. సలాఖపూర్ గ్రామానికి చెందిన ఏడాకుల భాస్కర్ రెడ్డి తన వ్యవసాయ భూమిని సాగు చేసుకునే క్రమంలో మంటలు హరితాహారం చెట్లకు అంటుకోవడంతో కొన్ని చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి కిరణ్ రైతుకు రూ.3వేలు జరిమాన విధించారు.

డబుల్ బెడ్రూం లబ్ధిదారులకు న్యాయం చేయాలి

గజ్వేల్‌రూరల్: అర్హులైన డబుల్ బెడ్రూం లబ్ధిదారులందరికీ న్యాయం చేయాలని సాధన కమిటీ కన్వీనర్ సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం లబ్ధిదారులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు.

వ్యక్తి అరెస్టు

బీబీపేట: పెళ్లి చేసుకుంటానని చెప్పి యువతిని మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ తిరుపయ్య తెలిపారు. సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. కామారెడ్డి జిల్లా బీబీపేట మండలానికి చెందిన ఓ యువతిని నిజాంపేట మండలం చల్మెడ గ్రామానికి చెందిన వడ్ల శివకృష్ణ పెళ్లి చేసుకుంటానని చెప్పి లొంగదీసుకున్నాడు. పెళ్లి చేసుకోవడానికి నిరాకరించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తిరుపయ్య, ఎస్సై సాయికుమార్ తెలిపారు.

అధికారుల నిర్వాకంతో అసౌకర్యం

దివ్యాంగులకు సభా వేదికగా మంత్రి హరీశ్ రావు క్షమాపణలు


బ్యాటరీ ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రి హరీశ్ రావు

సిద్దిపేటజోన్: జిల్లా అధికారి అత్యుత్సాహం వల్ల మీకు అసౌకర్యం కల్గింది. వారి పక్షాన రెండు చేతులు జోడించి క్షమించాలని కోరుతున్న అంటూ రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు దివ్యాంగులకు సభవేదిక ద్వారా క్షమాపణ కోరారు. సిద్దిపేట బాలసదనంలో రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవ రెడ్డితో కలిసి వికలాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్ల పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మంత్రి పర్యటన షెడ్యూల్‌ను సంబంధిత శాఖ అధికారులు మధ్యాహ్నం మూడు గంటలకు సమయం కేటాయించారు. కానీ అధికారులు లబ్ధిదారులను ఉదయం 10 గంటలకు నిర్దేశిత సభా స్థలానికి తీసుకొచ్చారు. మంత్రి బిజీ షెడ్యూల్ వల్ల నిర్ణీత సమయం 3 గంటలకు బదులుగా అరగంట ఆలస్యంగా వచ్చారు. రాగానే గంటల తరబడి వేచి చూస్తున్నారనే విషయం తెలుసుకున్న మంత్రి ముందుగా లబ్ధిదారులైన వికలాంగులకు చేతులు జోడించి క్షమాపణ చెప్పారు. అధికారుల అత్యుత్సాహం, వారి నిర్వాకం వల్ల మీరు వేచి ఉండే పరిస్థితిని తెచ్చారన్నారు. మిమ్మల్ని నిర్ణీత సమయం కంటే ముందుగా పిలిచి ఇబ్బందులు పెట్టిన అధికారుల తరుపున మంత్రి హరీశ్‌రావు చేతులు జోడించి క్షమాపణలు కోరారు. భవిష్యత్తులో ఇలా వికలాంగులకు ఇబ్బందులు పెట్టొద్దన్నారు. అనంతరం 150 మంది వికలాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు సాయిరాం, నాయకులు ఆనంద్, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

దొరికిన పర్సు పోలీసులకు అప్పగింత

నర్సాపూర్‌రూరల్: బస్సులో దొరికిన పర్సును తోటి ప్రయాణికుడు పోలీస్ స్టేషన్లో అప్పగించాడు. నర్సాపూర్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 15న హైదరాబాద్ నుంచి బోధన్ వెళ్లే బస్సులో ఓ ప్రయాణికుడు పర్సు పోగొట్టుకున్నాడు. అదే బస్సులో ప్రయాణిస్తున్న బ్రాహ్మణపల్లికి చెందిన పాత్‌లోత్ అనిల్‌కు పర్సు దొరికింది. అందులో రూ.5వేల నగదు, డెబిట్, క్రెడిట్‌కార్డులు ఉన్నాయి. వాటిని అనిల్ నర్సాపూర్ పోలీస్ స్టేషన్లో అప్పగించి తన వివరాలు అందజేశాడు. పోలీసులు పర్సులో ఆధారాలను బట్టి బాధితునికి ఫోన్‌చేసి పర్సు అప్పగించారు. బ్రహ్మణపల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు నిజాయితీని చాటుకున్న అనిల్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, జెత్యా, హైదర్ తదితరులు పాల్గొన్నారు.

భగవంతుని స్మరణతోనే సంతోషం

కంగ్టి(నారాయణఖేడ్): భగవంతుడు అందని వాడు కాదు..అందరివాడుగా తలిచి నిత్యం స్మరిస్తూ ఉండడంతో సంతోషం కలుగుతోదని రంగంపేట పీఠాధిపతి, యతీశ్వరులు శ్రీ మాధవనంద సరస్వతీ స్వామి ఉద్బోదించారు. సోమవారం కంగ్టి మండలంలోని రాంతీర్థం గ్రామంలో శ్రీరామాలయంలో జిల్లా బ్రాహ్మణసంఘం నిర్వహించిన 5వ యశస్సు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రవచనం చేశారు. గ్రామాల్లో అన్నీ కులాలవారు వర్గవిభేదాలు మాని దైవనామస్మరణలో ఉండాలన్నారు.

బాలికపై అత్యాచారం కేసులో ఒకరికి ఏడేళ్ల జైలు

కామారెడ్డి క్రైం: బాలికను అత్యాచారం చేసిన కేసులో ఒకరికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.ఐదు వేల జరిమానా విధిస్తూ కామారెడ్డి పోక్సో కోర్టు సోమవారం తీర్పు వెల్లడించింది. వివరాలిలా ఉన్నాయి. మెదక్ జిల్లాలోని ప్రగతి(దొంగల) ధర్మారం గ్రామానికి చెందిన బొజ్జా రవి బీబీపేటలోని తన సోదరి ఇంటికని వచ్చి ఇక్కడే పనులు వెతుక్కుని నివసించేవాడు. గతేడాది ఫిబ్రవరిలో బీబీపేటలోని ఓ ఆలయం వద్ద ఆడుకుంటున్న ఎనిమిదేళ్ల బాలికకు చాక్లెట్లు ఇప్పిస్తానని మాయ మాటలు చెప్పి తాను ఉంటున్న ఇంటికి తీసుకెళ్లి, అత్యాచారం చేశాడు. స్థానికులు నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కేసును విచారించిన కామారెడ్డి పోక్సో కోర్టు న్యాయమూర్తి లాల్ సింగ్ నాయక్ సోమవారం తీర్పు ఇచ్చారు. నిందితుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.ఐదు వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని భర్త ఆత్మహత్య

రామాయంపేట(మెదక్): భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్థాపానికి గురైన యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన సోమవారం రామాయంపేటలో వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం ...పట్టణానికి చెందిన ఎరుకల రవి భార్య గతంలో తల్లిగారింటికి వెళ్లి మళ్లీ రాలేదు. దీంతో రవి పలుమార్లు పెద్ద మనుషులతో చెప్పించినా ఫలితం లేదు. మనస్థాపానికి గురైన రవి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు మొక్కజొన్న దగ్ధం



కోహెడరూరల్(హుస్నాబాద్): ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు వచ్చి మొక్కజొన్న పంట దగ్దమైన ఘటన మండలంలోని తీగలకుంటపల్లెలో చోటుచేసుకుంది. మూల రాజిరెడ్డి మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. సోమవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పురవ్వలు పడి చేతికొచ్చే దశలో మొక్కజొన్న పంట పూర్తిగా దగ్దమైంది. దీంతో 150స్ప్రింక్లర్ పైపులు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనలో సుమారు 3లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని రైతు రాజిరెడ్డి కుటుంబసభ్యులు రోదిస్తున్నారు.ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని సర్పంచ్ మ్యాకల చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

బాలుడిని బలితీసుకున్న బండరాయి

● ఇంటి రేకులపై కోతులు దూకడంతో ఘటన


దేవునూరి అభినయ్ (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): వంటగదిపై ఉన్న రేకులు గాలికి లేవకుండా ఉండేందుకు పెట్టిన బండరాళ్లు బాలుడిని బలి తీసుకున్నాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కట్కూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన దేవునూరి శ్రీకాంత్–రజిత దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడు అభినయ్(2) వంటగదిలో తల్లి దగ్గర ఆడుకుంటున్నాడు. అయితే.. వంటగది పైకప్పు రేకులు గాలివానకు లేవకుండా ఉండేందుకు బండరాళ్లు పెట్టారు. ఇంటికి, వంటగదికి మధ్యలో కొంచెం గ్యాప్ ఉండడంతో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా కోతుల గుంపు వంటగదిపైకి చేరాయి. అవి ఇటూ ఇటూ దూకడంతో రేకులపై ఉన్న బండరాళ్లు.. తల్లి పక్కనే ఆడుకుంటున్న బాలునిపై పడ్డాయి. దీంతో బాలుడు మృతి చెందాడు.

అదృశ్యమైన వ్యక్తి .. శవమై ఇంటికి..


రమేశ్(ఫైల్)

పాపన్నపేట(మెదక్): విదేశాలకు వెళ్లే క్రమంలో ఏజెంటును కలవడానికనీ ఇంట్లో చెప్పి వెళ్లిన వ్యక్తి శవమై ఇంటికి వచ్చిన విషాద సంఘటన పాపన్నపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. సోమవారం ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..పాపన్నపేటకు చెందిన పోచమ్మకాడి రమేశ్(38) బెస్త పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. విదేశాలకు వెళ్లి డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో విదేశీ ప్రయాణానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 10న ఏజెంటును కలుస్తానని ఇంట్లో చెప్పి ఢిల్లీకి వెళ్లిన వ్యక్తి మరుసటి రోజు ఇంటికి ఫోన్ చేసి కుటుంబ సభ్యులతో మాట్లాడాడు. అనంతరం తన ఫోన్ స్విచ్ఆఫ్ అయ్యింది. అప్పటి నుంచి రమేశ్ ఆచూకీ కోసం ఎంత ప్రయత్నించినా లభ్యం కాలేదు. దీంతో కుటుంబ సభ్యులు మార్చి 17న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రమేశ్ ఫోన్ నంబర్ ఆధారంగా లోకేషన్ ట్రేస్ చేశారు. మధ్యప్రదేశ్‌లోని మోరేనా పట్టణంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి వద్ద రమేశ్ సెల్‌ఫోన్ ఉన్నట్లు గుర్తించారు. స్థానిక పోలీసులు అక్కడికి వెళ్లి విచారించగా రమేశ్ ఫోన్‌ను ఓ వ్యక్తి కొనుగోలు చేసి వాడుతున్నట్లు తెలుసుకున్నారు. అక్కడి పోలీసులతో కలిసి విచారణ చేయగా మార్చి 13 నుంచి ఒంటిపై దుస్తులు లేకుండా పిచ్చోడిలా తిరుగాడాడని, మూర్చతో చనిపోయినట్లు వారు తెలిపారు. దీంతో అక్కడి స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. గుర్తుతెలియని మృతదేహంగా పోలీసులు అక్కడే పూడ్చివేయించినట్లు తెలిపారు. పాపన్నపేట పోలీసులు రమేశ్‌కు చెందిన వివరాలతో, ఆధారాలను చూపడంతో మృతదేహాన్ని వెలికితీయించి సోమవారం పాపన్నపేట్‌కు తీసుకొచ్చినట్లు తెలిపారు. కాగా మృతిపై మధ్యప్రదేశ్ పోలీసులు ఆరా తీస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుండెపోటుతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి


మోజెస్ (ఫైల్)

కోహీర్(జహీరాబాద్): గుండెపోటుతో ఎన్ఆర్ ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ మృతి చెందిన ఘటన కోహీర్ మండలం, బిలాల్‌పూర్‌లో చోటు చేసుకుంది. ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం ఉదయం గుండెపోటు రావడంతో తీవ్ర అస్వస్థతకు గురైన మోజెస్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మోజెస్ మరణించాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యాయత్నం

జహీరాబాద్: అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకునేందుకు అటవీ ప్రాంతంలో విషం సేవించిన యువకుడిని పోలీస్ కానిస్టేబుల్ జైపాల్ భుజాలపై మోసుకొచ్చి ఆస్పత్రికి తరలించి ప్రాణం కాపాడాడు. వివరాల్లోకి వెళితే...జహీరాబాద్ మండలంలోని అల్గోల్ గ్రామానికి చెందిన రాజు(27)అనే యువకుడు ఆదివారం రాత్రి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెల్లెలు మహేశ్వరికి మెసేజ్ పెట్టాడు. దీంతో కంగారు పడిన చెల్లెలు వెంటనే 100 నెంబర్‌కు కాల్ చేసి విషయాన్ని చేరవేసింది. డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ జైపాల్ ఎస్‌ఐకి సమాచారం ఇచ్చి అల్గోల్ గ్రామానికి వాహనంపై డ్రైవర్‌తో కలిసి వెళ్లాడు. గ్రామంలోని పాఠశాల భవనం వెనకాల ఉన్న అటవీ ప్రాంతంలోకి నెట్‌వర్క్ ఆధారంగా బాధితుడి చెల్లెలు, గ్రామస్థుడి సహాయంతో అటవీ ప్రాంతంలోకి కాలినడకన వెళ్లారు. విషం సేవించి ఉన్న రాజును సుమారు కిలోమీటర్ దూరం మేర కానిస్టేబుల్ వాహనం వరకు జైపాల్‌భుజంపై మోసుకొచ్చి ఆస్పత్రికి తరలించాడు. సకాలంలో వైద్యం అందడంతో రాజు ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. ప్రథమ చికిత్స అనంతరం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సకాలంలో స్పందించి ఓ నిండు ప్రాణాన్ని కాపాడిన కానిస్టేబుల్ జైపాల్‌ను డీఎస్పీ రఘు, సీఐ భూపతి, ఎస్‌ఐ శ్రీకాంత్‌లు అభినందించారు. రాజు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి...

కొండపాక(గజ్వేల్): కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మ హత్యకు పాల్పడ్డ ఘటన త్రీటౌన్ పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. త్రీ టౌన్ సీఐ భానుప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం..త్రీటౌన్ పోలీస్టేషన్ పరిధిలోని సిర్సనగండ్ల గ్రామానికి చెందిన సంకటాల యాదగిరి(35)హమాలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడన్నారు. తరుచూ కుటుంబంలో గొడవలు జరుగుతుండటంతో తాగుడుకు బానిసై సోమవారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మనోహరాబాద్(తూప్రాన్): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మనోహరాబాద్ మండలం, కాళ్లకల్ గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..55 నుంచి 60 సంవత్సరాల వ్యక్తి మృతదేహం కాళ్లకల్‌లో లభ్యమైందన్నారు. గ్రామ కార్యదర్శి శంకర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

వ్యాన్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

తప్పిన ప్రమాదం

పెద్ద శంకరంపేట(మెదక్): పెద్ద శంకరంపేట మండల పరిధిలోని చీరాపల్లి క్రాస్ రోడ్ వద్ద ఎదురుగా వస్తున్న నారాయణఖేడ్ డిపో ఆర్టీసీ బస్సు మూలమలుపు వద్ద సంస్కార్ విద్యాలయ పాఠశాలకు చెందిన వ్యాన్‌ను సోమవారం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరేపల్లికి చెందిన కృష్ణమోహన్ అనే విద్యార్థికి స్వల్ప గాయాలు అయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్సలు నిర్వహించారు. వ్యాన్లో పదిమంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారన్నారు. కాగా విద్యార్థి బంధువులు పాఠశాల యాజమాన్యం నారాయణఖేడ్ డిపో బస్సుపై పెద్ద శంకరంపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తూప్రాన్: పట్టణంలోని కరీంగూడ సమీపంలో పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు ఎస్‌ఐ సురేశ్‌కుమార్ దాడులు నిర్వహించినట్లు సోమవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం..కరీంగూడకు సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం తెలుసుకొని సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.21,840లను స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేపట్టామన్నారు.

ద్విచక్ర వాహనానికి నిప్పు

మెదక్ మున్సిపాలిటీ: గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనానికి నిప్పంటించి కాల్చివేసిన ఘటన మెదక్ పట్టణం సుభాష్ నగర్‌లో ఆదివారం రాత్రి జరిగింది. మెదక్ పట్టణ ఎస్‌ఐ మల్లారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మెదక్ పట్టణం సుభాష్ నగర్‌కు చెందిన బింగరి లక్ష్మణ్ తన మోపెడ్ ద్విచక్ర వాహనాన్ని ఇంటి ఆవరణలో ఆదివారం పార్క్ చేసి ఉంచాడు. సోమవారం ఉదయం చూసే సరికి కాల్చి వేసినట్లు ఉందన్నారు. ఈ మేరకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ మల్లా రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారన్నారు.

ఫిర్యాదులను సీఈఐఆర్ యాప్‌లో నమోదుచేయాలి

సిద్దిపేట అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్


నూతన యాప్ గురించి మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్

సిద్దిపేటకమాన్: సెల్‌ఫోన్ పోయిందని వచ్చే ఫిర్యాదులను సీఈఐఆర్ యాప్‌లో నమోదు చేయాలని సిద్దిపేట అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ పోలీస్ సిబ్బందికి సూచించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో రిసెప్షనిస్టులకు(సీఈఐఆర్) సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ యాప్‌పై సోమవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ మాట్లాడుతూ..ప్రస్తుత జీవన శైలిలో మొబైల్ ఫోన్ అత్యంత కీలకంగా మారిందన్నారు. ఏవరైనా సెల్‌ఫోన్లు పోగొట్టుకుంటే దాన్ని గుర్తించడానికి పోలీసులు ఇప్పటికే పలు రకాల టెక్నాలజీ వాడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సీఈఐఆర్ యాప్ ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను గుర్తించొచ్చన్నారు. పోయిన సెల్‌ఫోన్ పూర్తి వివరాలు ఈ యాప్‌లో నమోదు చేయడం ద్వారా దాన్ని బ్లాక్ చేస్తారు. దీంతో అది పనిచేయదు. తిరిగి అది దొరికిన తర్వాత ఆన్‌లైన్‌లో ఈ యాప్ ద్వారా అన్‌బ్లాక్ చేయడంతో ఆఫోన్ తిరిగి పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ సెల్ శ్రీకాంత్, కానిస్టేబుల్ రమేశ్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ విగ్రహ నిర్మాణాన్ని అడ్డుకోవడం సరికాదు


హైకోర్టు ఇచ్చిన స్టే కాపీని అందజేస్తున్న భగత్‌సింగ్ విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు

గజ్వేల్‌రూరల్: భగత్‌సింగ్ విగ్రహ నిర్మాణాన్ని అడ్డుకోవడం సరికాదని భగత్‌సింగ్ విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు, విద్యార్థి, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు పేర్కొన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలోని ఐవోసీ(ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) సమీపంలోని టీ జంక్షన్ వద్ద భగత్‌సింగ్ విగ్రహ నిర్మాణ పనులను మున్సిపల్ పాలకవర్గం, అధికారులు అడ్డుకోవడాన్ని ఖండిస్తూ హైకోర్టును వారు ఆశ్రయించారు. దీంతో ఆ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టొద్దని హైకోర్టు స్టే ఇచ్చినట్లు వారు తెలిపారు. మున్సిపల్ అనుమతులు పొందిన తర్వాత భగత్‌సింగ్ విగ్రహ నిర్మాణ పనులను చేపట్టగా మున్సిపల్ అధికారులు, పాలకవర్గ సభ్యులు అడ్డుకొని నిర్మాణాలను తొలగించడం సరికాదని, ఇది స్వాతంత్ర్య సమరయోధులను అవమాన పర్చడమేనన్నారు. ఈ కార్యక్రమంలో భగత్‌సింగ్ విగ్రహ కమిటీ సభ్యులు రమణాకర్, వినోద్, బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు ఓంప్రకాశ్, బీజేపీ గజ్వేల్ నియోజకవర్గ కోకన్వీనర్ సురేశ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్‌యాదవ్, మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు కృపానందం, ఎమ్మార్పీఎస్ నాయకుడు ముంద్రాతి కృష్ణ, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు కరుణాకర్, ఇన్‌చార్జి నరేశ్‌తో పాటు ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏడుపాయల్లో నీట మునిగి వ్యక్తి మృతి


హన్మంతు (ఫైల్)

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వనదుర్గ ప్రాజెక్టు వద్ద నీటిలో మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... టేక్మాల్ మండలం ఎల్లంపల్లి గ్రామానికి చెందిన వడ్డెర హన్మంతు(72)కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం దుర్గామాత దర్శనానికి ఏడుపాయలకు కుటుంబ సభ్యులతో వచ్చాడు. అక్కడ హన్మంతు ప్రసాదం తిని చేతులు కడుక్కోవడానికి ప్రాజెక్టులోకి దిగాడు. ప్రమాదవశాత్తు నీటిలోకి జారి మునిగిపోయాడు. కుటుంబీకులు నీటిలో ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం మృతదేహం నీటిలో తేలుతూ కనిపించింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి కొడుకు భీమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అత్యాచారం కేసులో తండ్రికి జీవిత ఖైదు

పటాన్‌చెరు టౌన్: కూతురిపై తండ్రి అత్యాచారం చేసిన కేసులో స్పెషల్ పోక్సో ఎఫ్‌టీఎస్ కోర్టు న్యాయమూర్తి జీవిత ఖైదు విధించిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులు, పీపీ అనంతరావ్ కులకర్ణి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...ఐలాపూర్ గ్రామానికి చెందిన ఓ తండ్రి 2021, ఆగస్టు 21న తల్లి ఇంట్లో లేని సమయంలో 14 సంవత్సరాల కూతురిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడు. దీంతో ఆబాలిక ఫోన్లో తల్లితో జరిగిన విషయాన్ని చెప్పింది. సమాచారం తెలుసుకున్న తల్లి అదే రోజు అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో పోలీసులు నిందితుణ్ని స్పెషల్ పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ముందు హాజరు పర్చగా పీపీ వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి సుదర్శన్ అత్యాచారానికి పాల్పడిన తండ్రికి సోమవారం జీవిత ఖైదుతో పాటు రూ. 2వేలు జరిమాన విధించింది. జరిమాన చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

శివం పేటకు వెళ్లి వస్తుండగా వెంకటాపూర్ గ్రామ శివారులో బుల్లెట్ అదుపు తప్పి వ్యక్తి మృతి చెందాడు. బైక్‌పై వెళుతున్న యువకుడు చిన్న శంకరంపేట మండల పరిధిలో డీసీఎం ఢీకొని మృత్యువాత పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.


సోము ప్రశాంత్ (ఫైల్)

తూప్రాన్,(శివ్వంపేట): బుల్లెట్ అదుపు తప్పి గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన సోము ప్రశాంత్ (25) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం రాత్రి తూప్రాన్ నుంచి దొంతికి వస్తుండగా వెంకటాపూర్ గ్రామ శివారు వద్ద బుల్లెట్ అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ఘటనలో తలకు, పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. సోమవారం అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి తెల్లవారు జామున మృతిచెందాడు. మృతుడికి 6 నెలల క్రితం దొంతి గ్రామానికి చెందిన యువతితో ప్రేమ వివాహం జరిగింది. మృతుడి తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసుకున్నట్లు ఎస్‌ఐ సురేష్‌కుమార్ పేర్కొన్నారు.

డీసీఎం ఢీకొని..


సతీష్‌గౌడ్ మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్): డీసీఎం ఢీకొన్న ఘటనలో బైక్‌పై వెళుతున్న యువకుడు మృతి చెందాడు. చేగుంట మండలం పొలంపల్లి గ్రామానికి చెందిన రాపాకుల సతీష్‌గౌడ్(30) ఆదివారం చిన్నశంకరంపేటకు వచ్చాడు. బైక్‌పై రాత్రి తిరిగి వెళుతుండగా, పెట్రోల్‌పంప్ సమీపంలోని అమిత పైప్స్ పరిశ్రమ వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సతీష్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. డీసీఎం డ్రైవర్ అజాగ్రత్తగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని చిన్నశంకరంపేట ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్క్రాప్ దుకాణంలో అగ్ని ప్రమాదం

సుమారు రూ.20లక్షలకు పైగా ఆస్తి నష్టం


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

తూప్రాన్: ప్రమాదవశాత్తు స్క్రాప్ దుకాణానికి మంటలు అంటుకుని సుమారు రూ.20లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగిన సంఘటన పట్టణ కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. శివ్వంపేట మండలం పోతారం గ్రామానికి చెందిన ఆంజనేయులు గత కొన్నేండ్లుగా పట్టణంలో పాత ఇనుప సామగ్రి దుకాణంలో వ్యాపారం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే సోమవారం తన దుకాణ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు చెత్తను కాల్చడంతో ఆ మంటలు తమ దుకాణంలోకి వ్యాపించినట్లు బాధితుడు ఆంజనేయులు తెలిపాడు. మంటలు ఒక్కసారిగా దుకాణాన్ని చుట్టుముట్టి వ్యాపించాయి. వెంటనే పోలీసులకు, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. నర్సాపూర్ నుంచి అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను ఆర్పేందుకు శ్రమించారు. కానీ అందులో నీళ్ల అయిపోవడంతో మున్సిపల్ ట్యాంకర్లతో నీళ్లను తీసుకువచ్చి మూడు గంటల శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.20లక్షలకు పైగ ఆస్థి నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు.